క్లుప్తంగా

హైకోర్టు భవనాన్ని నిర్మించాలని వినతి



జస్టిస్ నందను కలిసిన న్యాయవాదులు

బోథ్: హైకోర్టులో పోర్టు పోలియో జడ్జిగా నియమితులైన జస్టిస్ సూరిపెల్లి నందను సీనియర్ న్యాయవాది వినోద్‌కుమార్‌ను బోథ్ బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం హైకోర్టు ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ కోర్టు భవనాన్ని త్వరగా నిర్మించేలా చూడాలని కోరారు. జడ్జి సానుకూలంగా స్పందించిందన్నారు. జడ్జిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్‌రావు, కార్యదర్శి పంద్రం శంకర్ ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాలలో బీఏ, బీకామ్, బీఎస్సీ, లైఫ్ సైన్స్, తదితర కోర్సులు ఉన్నాయని, ఒక్కో గ్రూప్‌లో 60 చొప్పున సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. బుధవారం మండలంలోని బూర్నూర్ గ్రామాన్ని సీపీఐ (ఎం) నాయకులు పరిశీలించారు. వరదలతో కూలిపోయిన ఇళ్లను, నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో, ఇండ్లు కూలిపోయిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లు కూలిపోయిన వారికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు ఆ పార్టీ నాయకులు బండి దత్తాత్రి, లంక రాఘువులు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్వచ్ఛంద సభ్యులు

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామం వద్ద రెండు ఆటోలు ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న తొర్తి సాగర, కూతురు సోనిల ఆపరేషన్ ఉండగా, పేదరికంలోని వారికి ఆదుకోవాలని నిమ్స్‌లో తల్లీకూతుళ్లు శీర్షికన బుధవారం సాక్షితో కథనం ప్రచురితమైంది. మదర్ డ్రీమ్స్ సభ్యులు రూ.6వేలు, ఆటో యూనియన్ సభ్యులు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

వంతెన నిర్మించాలని రాస్తారోకో



రాస్తారోకోలో గ్రామస్తులతో నరేశ్

గుడిహత్నూర్: మండలంలోని టాకీగూడ గ్రామ సమీపంలో వాగుపై వంతెన నిర్మించాలని ఏఐసీసీ సభ్యుడు నరేశ్ అన్నారు. గ్రామస్తులతో కలిసి ఆయన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. గత నెల 28వ తేదీన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ పరిశీలించి ఆయన వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేయలేదన్నారు. జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ రాస్తారోకోలో పాల్గొని సంఘీభావం తెలిపారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో సునీత, ఎంపీవో లింగయ్య వారిని సముదాయించే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పేయ్ ఫోన్ ద్వారా నరేశ్ జాదవ్‌తో మాట్లాడి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

పశువుల పాక దగ్ధం

బేల: మండలంలోని పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని రైతు అబ్దుల్ తన్వీర్ పొలంలో మంగళవారం అర్ధరాత్రి ఒకటి దాటిన క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో పశువుల పాక దగ్ధమైంది. ఇందులో ఆవు, మూడు ఎద్దులు మృతిచెందాయి. 110ఎరువుల బస్తాలు, స్ప్రింకర్ల పైపులతో పాటు సామగ్రి దగ్ధమైంది.

పంచాయతీల్లో పరేషాన్



ఏం చెప్పుమంటరన్నా... మా పరిస్థితి బాగోలేదు.. పంచాయతీ ఖాతాలో నయా పైసా పడటం లేదు. అధికారులు ఫోన్ చేసి వ్యాధులు రాకుండా గ్రామంలో మురుగుకాల్వలు, వీధులు శుభ్రం చేయండి అంటున్నారు. ఎక్కడి నుంచి తేవాలే..పేరుకే సర్పంచులం మా బాధలు ఎవరూ తీరుస్త లేరు.. ఇది నేరడిగొండ మండలంలోని కొర్టికల్ కె గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆత్రం పద్మ ఆవేదన.



నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామపంచాయతీలో రోడ్డు దుస్థితి

నేరడిగొండ: గ్రామపంచాయతీల్లో నిధులు మంజూరు కాక సర్పంచుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంచాయతీ ఖాతాల్లో నయా పైసా లేదు. అధికారులు ఫోన్ చేసి వ్యాధులు రాకుండా గ్రామాల్లో మురుగు కాల్వలు, వీధులు శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని చెబుతున్నారు. ఎక్కడి నుంచి డబ్బులు తీసుకోవాలి. పేరుకే సర్పంచులం.. మా బాధలు ఎవరూ తీరుస్తారంటూ సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

గతంలో మూడు నెలలకోసారి నిధుల మంజూరు..

పంచాయతీలకు గతంలో మూడు నెలలకోసారి కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి జనాభా ప్రకారం నిధులు విడుదలయ్యేవి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ డబ్బులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యేవి. సాధారణ నిధులను కూడా ప్రభుత్వం ఆర్థికశాఖ ద్వారా ఎప్పటికప్పుడు పంచాయతీ ఖాతాల్లో జమ చేసేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గతేడాది జూలై నుంచి పంచాయతీలకు సీఎఫ్‌సీ నిధులు రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఈ నిధులను ఇన్నాళ్లు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించేది. కేంద్రమే పంచాయతీ ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తుందని ప్రకటించడంతో సర్పంచులు సంతోషించారు. ఏడాది గడుస్తున్నా నిధులు రాకపోవడంతో సర్పంచులు నిరాశలో ఉన్నారు. కొన్ని పంచాయతీ ఖాతాల్లో సీఎఫ్‌సీ నిధులు పడినా టైడ్, అన్‌టైడ్ పేరుతో ప్రొసీజర్లు ఉండడంతో డ్రా చేసుకునేందుకు సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్‌ఎఫ్‌సీ నిధులు రావడం లేదని, నెలనెలా రావాల్సిన సాధారణ నిధులు రాక గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం భారంగా మారుతోందని, కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని సర్పంచులు వాపోతున్నారు.

మంజూరు కాని బిల్లులు..

2019 జనవరిలో ఎన్నికలు జరగగా ఫిబ్రవరి 2న సర్పంచులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలో 18 మండలాల పరిధిలో 468 పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీలో ఉపాధి హామీ కింద రూ.కోటికి పైగా ఖర్చు చేసి పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. వీటిని సర్పంచులే ముందుండి నిర్మించగా, మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి బిల్లులు రాక మూడేళ్లవుతోంది. బిల్లుల సమస్య కారణంగా ఏడాది నుంచి సర్పంచులు గ్రామాల్లో ఎలాంటి పనులు చేపట్టడం లేదు. గ్రామాల్లో మురుగు కాల్వలు, అంతర్గత రహదారుల నిర్మాణం, పైపులైన్‌ల విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్నా గ్రామస్తుల నుంచి మాటలు పడుతున్నారే తప్పా వాటి జోలికి వెళ్లడం లేదు.

సమాధానం చెప్పలేకపోతున్నాం



గత ప్రభుత్వాల హయాంలో పంచాయతీలకు పుష్కలంగా నిధులు వచ్చేవి. పనులు చేయగానే బిల్లులు అందేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొన్ని పనుల బిల్లులు మూడేళ్ల తర్వాత వచ్చాయి. బిల్లులు రావని పనులు చేపట్టడం లేదు. ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం.

\- అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, సర్పంచ్, తేజాపూర్

ఏళ్లుగా బిల్లులు రావడం లేదు



ప్రభుత్వం పంచాయతీలకు నిధులు మంజూరు చేయడం లేదు. చేసిన పనులకు ఏళ్లుగా బిల్లులు కూడా రావడం లేదు. చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్‌కు వేల రూపాయల ఖర్చు అవుతుంది. కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు నెలకు రూ.17వేలు కావాలి. సీసీ రోడ్డు, శ్మశానవాటిక, ప్రకృతి వనం బిల్లులు ఇప్పటి వరకు రాలేదు.

మండాడి గోదావరి, సర్పంచ్, యాపల్‌గూడ

జీపీ ఖాతాలో నిధులు లేవు



మా పంచాయతీ ఖాతాల్లో ఒక్క రూపాయి ఉండటం లేదు. నెలకు రూ.32వేలు వస్తున్నాయి. ట్రాక్టర్ కిస్తులు, మల్టీ వర్కర్లకు మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదు. పనులు చేసిన వాటికి బిల్లులు సైతం రాలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం నిధులు ఇవ్వాలి.

\- గంగాప్రసాద్, సర్పంచ్, ఆరేపల్లి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామన్న



నేరడిగొండ: పరిశీలిస్తున్న మాజీ ఎంపీ నగేష్

ఆదిలాబాద్‌రూరల్: భారీ వర్షాలతో నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని ప్రభుత్వ పరంగా పూర్తిగా అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న రైతులకు భరోసా కల్పించారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ, బూర్నూర్, చిచ్‌ధరి, లోహారా, జంబుల్‌ధరి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. నష్టపోయిన పంట పొలాలను, కూలిపోయిన ఇళ్లను, కోతకు గురైన వంతెనలను పరిశీలించి మాట్లాడారు. అధికారులతో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలను పంపించడం జరుగుతుందని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. యాపల్‌గూడ సమీపంలోని తీన్‌నాలా డ్యాంను పరిశీలించిన ఆయన నిపుణుల కమిటీ సూచనల మేరకు డ్యాం సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతామన్నారు. వర్షాలతో ఇండ్లు కూలిపోయిన వారికి త్వరలో ప్రారంభం కానున్న గృహలక్ష్మీ పథకం కింద ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. నియోజకవర్గంలో సుమారు 30వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలుస్తుందని వివరించారు. పరిహారం కింద ప్రభుత్వం రూ. 500 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, నాయకులు ప్రహ్లాద్, కుమ్ర రాజు, సెవ్వ జగదీష్, తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం..

నేరడిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులు, కడెం పరీవాహక ముంపునకు గురైన రైతులు, బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని మాజీ మంత్రి, మాజీ ఎంపీ గొడం నగేష్ స్పష్టం చేశారు. బుధవారం నేరడిగొండ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొట్టుకుపోయిన పంటలు, రోడ్లను పరిశీలించారు. తాంసి జెడ్పీటీసీ రాజు, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడె శీల, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, బోథ్ పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, జిల్లా నాయకులు గాదె శంకర్ ఉన్నారు.

మహిళల భద్రత కోసమే షీ టీం



అవగాహన కల్పిస్తున్న షీ టీం అధికారులు

నార్నూర్: మహిళ భద్రతతో పాటు సంరక్షణకు షీటీం పని చేస్తుందని షీ టీం ఇన్‌చార్జి భాగ్యశ్రీ, కమల అన్నారు. బుధవారం మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు షీ టీం కార్యకలాపాలు, మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్బందుల్లో ఉన్న మహిళలు, బాలికలకు స్థిరమైన, నమ్మకమైన పద్ధతుల ద్వారా సాయం అందించడం జరుగుతుందన్నారు. సాంకేతిక ఇంటిగ్రేషన్ ఉపయోగించి అవగాహన కల్పిస్తామన్నారు. ఎవరైనా వేధిస్తే వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్‌లు పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, ఉపాధ్యాయులు అడే విశ్వనాథ్ ఉన్నారు.

విద్యార్థులను పట్టించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: వర్షాకాలంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారినపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వసతిగృహాలు, పాఠశాలల్లో సీజనల్ వ్యాధులతో విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. వసతి గృహాల్లో ఏఎన్‌ఎంలు లేక వారికి వైద్యం అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



సుహాసినిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్: దడువాయిలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దడువాయి సంఘం నాయకులు ఆమెను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దడువాయిలకు అండగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం సుహాసిని రెడ్డి హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో ఫోన్లో ఈ విషయమై మాట్లాడగా శాసనసభలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.

కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధన స్థానం, కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం కళాశాలను సందర్శించి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదని, గత కొన్ని నెలలుగా వారికి వేతనాలు రావట్లేదన్నారు. వారికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైరస్‌తో ఎలాంటి ప్రమాదం లేదు



కంటిలో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి బాలు

నార్నూర్: విద్యార్థులకు వస్తున్న కళ్ల కలక వ్యాధితో ఎటువంటి ప్రమాదం లేదని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుమ్ర బాలు అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడే వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు ఐడ్రాప్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న కొంత మంది విద్యార్థులకు కళ్ల కలక వైరస్ సోకిందన్నారు. ఇది ఐదు రోజుల తర్వాత తగ్గిపోతుందని వివరించారు. విద్యార్థులు తమ చేతులను తాకడం వలన లేదా బట్టలు వాడడం వలన ఒకరి నుంచి ఒకరికి అంటుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యార్థులకు ఐడ్రాప్‌లు వేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో ముందుల కొరత లేదని తెలిపారు. ఆయన వెంట వైద్యుడు డాక్టర్ రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, ఏఎన్‌ఎం సింధు ఉన్నారు.

బోథ్ డివిజన్ ఏర్పాటు అనివార్యం



మాట్లాడుతున్న నాయకులు

బోథ్: బోథ్ డివిజన్ ఏర్పాటు అనివార్యమని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు పేర్కొంటున్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు అయితే ఉన్నత విద్య బోథ్ ప్రాంత వాసులకు అందుతుందని వివరించారు. తమ కుటుంబ సభ్యులకు డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేయాలని వివరించారు. మండల కేంద్రానికి చెందిన వెపన్స్ యూత్ సభ్యులు దీక్షలో కూర్చున్నారు. దీక్షాపరులకు సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మద్దతు ప్రకటించారు. బోథ్ డివిజన్‌గా చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు.

ఉద్యమం కోసం విద్యార్థుల విరాళం

బోథ్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు కోసం చేస్తున్న ఉద్యమానికి అండగా ఉండేందుకు బోథ్‌కు చెందిన పలువురు విద్యార్థులు సాధన సమితి సభ్యులకు తోచినంత సహాయాన్ని అందించారు. ఆర్థిక పరంగా ప్రతీ ఒక్కరు అండగా ఉండాలని కోరారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపే ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. డబ్బా పాలు తాగించడంతో వాంతులు, విరోచనాలు, పిల్లల్లో ఎదుగుదల తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద పాల్గొన్నారు.

తల్లిపాలే మేలు..

ఇచ్చోడ: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సర్వరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని కేశవపట్నంలో తల్లి పాలు వారోత్సవాలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి పాల్గొన్నారు.

బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలి

ఇంద్రవెల్లి: పుట్టిన ప్రతీ బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీళ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్నూర్ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు, గర్భిణిలకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, హిరమోతి, తిరుమల ఉన్నారు.

బాధితులను ఆదుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20వేలు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లూరి రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తంతోలి, అంకోలి, జంబుల్‌ధరి, మామిడిగూడ, వాన్‌వాట్, పిప్పల్‌ధరి, రాములుగూడ, యాపల్‌గూడ గ్రామాల్లో పర్యటించారు. పార్లమెంటు అధికార ప్రతినిధి ఎండి రఫీక్ ఉన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ఆదిలాబాద్: అంబేద్కర్ ఆశయ సాధనకు సమిష్టిగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. నూతనంగా ఎన్నికైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ కార్యవర్గ సభ్యులను జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి చేశారన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఆదిలాబాద్‌టౌన్: వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఓ ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు, యాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ యాప్ ద్వారా ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే యాప్‌ను స్కాన్ చేస్తే వారి కుటుంబ సభ్యులకు సమాచారం వెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి సతీష్, బీఆర్‌ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్, మెట్టు ప్రహ్లాద్, బండారి దేవన్న, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

బజార్‌హత్నూర్: ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని డీపీవో శ్రీనివాస్‌రావ్ తెలిపారు. బుధవారం మండలంలోని మోర్కండి, చింతలసాంగ్వి, గులాబ్ తాండ గ్రామాల్లో పారిశుధ్యం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, సర్పంచులు విద్యాసాగర, మడవి ప్రకాష్, అనిత ఇస్తారి పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

నేరడిగొండ: గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని ఏఐసీసీ సభ్యుడు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్రం కోటేష్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు, ఇచ్చోడ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ నాగనాథ్ అప్పా ఉన్నారు.

ఆదివాసీలకు తీరని లోటు

బోథ్: ఉట్నూర్ ఐటీడీఏ చైర్మన్ లక్కేరావు అకాల మరణం ఆదివాసీలకు తీరని లోటని ఐటీడీఏ డైరెక్టర్ మేస్రం భూమన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... ఆదివాసీల అభివృద్ధికి లక్కేరావు నిరంతరం కృషి చేశారని తెలిపారు. అనంతరం ఆదివాసీలతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బోథ్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం బోథ్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల దీక్షలకు సంఘీభావం ప్రకటించారు.

ముదిరాజ్ డిమాండ్లను నెరవేర్చాలి

బోథ్: ముదిరాజ్ డిమాండ్లను నెరవేర్చాలని ఆ సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బిసి డి నుంచి బిసి ఏలోకి మార్చాలన్నారు. పోడు పట్టాలను ఇవ్వాలని, బీసీ బంధు ఇవ్వాలని అన్నారు. సంఘం మండల అధ్యక్షులు భోజన్న, ప్రధాన కార్యదర్శి సాయన్న, శ్రీనివాస్, భోజరాజు, రాజశేఖర్ ఉన్నారు.

ఆలయ నిర్మాణం అభినందనీయం

ఇచ్చోడ: శబరీమాత ఆలయం నిర్మించడం అభినందనీయమని అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని అడేగామ బిలో నూతనంగా నిర్మిస్తున్న శబరీ మాత ఆలయ నిర్మాణం పనులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కథం సుభాష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కదం బాబారావు, మాదవ్ అమ్టె పాల్గొన్నారు.

ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి

బోథ్: చిన్న వయస్సులో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని బోథ్ సీఐ భీమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ గంగారెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత పాల్గొన్నారు.

హస్నాపూర్‌లో అన్నాభావు సాఠే జయంతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో బుధవారం అన్నబాహు సాటే జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి కమిటీ అధ్యక్షుడు జ్ఞాను, సర్పంచ్ జాదవ్ ఉపేందర్, ఉప సర్పంచ్ నెదునూరి అశోక్, ఎం.రాం ఉన్నారు.

రుణమాఫీపై హర్షం..

బోథ్: రైతు రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని బుధవారం సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ హర్షం వ్యక్తం చేశారు.

మోడిగూడ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని మెడిగూడ ఆశ్రమ పాఠశాల్లో బుధవారం వైద్యాధికారి సాయిబాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణా, ఏఎన్‌ఎం సురేఖ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి తేలు విశ్వేతేజాను బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ పరామర్శించారు.

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామ వీఆర్‌ఏ బాపురావ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్ బుధవారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మోర్కండి ఉపసర్పంచ్ తిరుపతి మృతిచెందగా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదు

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మెజారిటీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. హర్యానా రాష్ట్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభిషేక్ యాత్రపై జరిగిన దాడికి జిల్లా వీహెచ్‌పీ నాయకులు నిరసనకు పిలుపునివ్వగా వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు.

కార్మిక గర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జగన్‌సింగ్

ఎదులాపురం: సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్మిక గర్జనను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో పార్టీ భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమం గాలికొదిలేసిందన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న గర్జనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఇందులో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు గౌరాల సుభాష్, సహాయ కార్యదర్శి నితిన్, నాయకులు రాజు పాల్గొన్నారు.